క్లుప్తంగా

బాపట్ల జీవనాడి టౌన్‌హాల్



బాపట్ల: సర్వ కళల కేంద్రంగా, బాపట్ల జీవనాడిగా టౌన్ హాల్ విరాజిల్లుతుందని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు పేర్కొన్నారు. టౌన్ హాలులో 119వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. తెలుగుతల్లి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ అనాదిగా ఎన్నో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలకు టౌన్‌హాలు పట్టుగొమ్మగా నిలిచిందని అన్నారు. తెలుగు ప్రజల స్వరాష్ట్ర వాంఛకు టౌన్ హాల్ ముత్యాల పందిరి వేసిందని కొనియాడారు. ఎందరో జాతీయ నాయకుల ప్రసంగాలకు సాక్షీభూతంగా నిలిచిందని పేర్కొన్నారు. 1913లో ప్రథమాంధ్ర మహాసభ ఇక్కడే జరిగిందని గుర్తు చేశారు. టౌన్‌హాల్‌ను 1905 జులై 17న అప్పటి గుంటూరు జిల్లా కలెక్టర్ బ్రూడీ ప్రారంభోత్సవం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూన రాణి, పౌర సమాఖ్య నాయకులు డాక్టర్ బి శరత్ బోస్, డాక్టర్ కె విజయకుమార్, జమృద్ భాషా, రమణ కుమార్, జీవీ, సీనియర్ సిటిజన్ నాయకులు జీవీ బ్రహ్మం, శ్రీహరిరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు ఆందోళనకు సిద్ధం కండి

కొల్లూరు : ఉపాధిహామీ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న కూలీల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ నెల 20న చేపట్టనున్న ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బొనిగల సుబ్బారావు కోరారు. బుధవారం మండలంలోని జువ్వలపాలెం, కిష్కిందపాలెం, తిప్పలకట్ట, తోకలవానిపాలెం గ్రామాలలోని ఉపాధిహామీ కూలీలను కలిసి కూలీల విషయంలో ప్రభుత్వం చూపుతున్న అశ్రద్ధపై అవగాహన కల్పించారు. ధర్నా కార్యక్రమానికి అధిక సంఖ్యలో ఉపాధిహామీ కూలీలు తరలి రావాలన్నారు. ఉపాధిహామీ కింద పనిచేసిన కూలీలకు 7 వారాలకు సంబంధించిన నగదు నేటికీ జమ కాలేదని, ఈ సమస్యపై అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందని వాపోయారు. ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు జరుగుతున్న కుట్రలను ఎదుర్కోవడంతో పాటు, కూలీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం శనివారం కొల్లూరు మండల పరిషత్తు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టనున్నట్లు వివరించారు.

నేటి నుంచి జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు



రేపల్లె రూరల్: జనసేన పార్టీ బలోపేతానికి ఈ నెల 18న పార్టీ క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మత్తి భాస్కరరావు తెలిపారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే ఈ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టటం జరిగిందన్నారు. సభ్యత్వ నమోదు చేసుకున్న వారు మరో పది మందితో సభ్యత్వ నమోదు చేయించాలన్నారు. కార్యక్రమంలో మెండు సుబ్బారావు, చందోలు ప్రసాద్, రేపల్లె జానకయ్య, దూల సురేష్, మైల నరేష్‌యాదవ్, మండే ప్రసాద్, యార్లగడ్డ చక్రవర్తి, గూడపాటి శ్రీనివాసరావు, పూషాడపు నాని, అందే సాంబశివరావు, బత్తుల మల్లి, తదితరులు పాల్గొన్నారు.

పౌరుల సంక్షేమానికి నిధులు కేటాయించాలి



లక్ష్మీపురం: మోదీ ప్రభుత్వం రానున్న బడ్జెట్‌లో సామాన్య పౌరుల సంక్షేమంపై దృష్టి సారించాలని, చిన్న వ్యాపారాలను పెంచేందుకు మరిన్ని ఉద్యోగాలు కల్పించేందుకు తయారీ రంగానికి మరిన్ని నిధులు కేటాయించాలని అర్థశాస్త్ర శాఖాపన్యాసకులు సి.హెచ్.సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కేంద్ర బడ్జెట్‌పై బుధవారం చర్చా గోష్టి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తన దృష్టిని కొంత వరకు క్షేత్ర స్థాయి ఆర్థిక సంక్షేమం వైపు మళ్లించటం చాలా అవసరమన్నారు. సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, విశ్లేషకులు ఇ.చంద్రయ్య మాట్లాడారు.

ఆలయాల్లో మార్మోగిన గోవింద నామం



బాపట్ల క్షీర భావన్నారాయణ స్వామి ఆలయంలో సహస్ర పారాయణం



భట్టిప్రోలు సాధన మండలిలో కర్పూర యజ్ఞంలో మహిళలు



రేపల్లెలో ప్రత్యేక అలంకరణలో వేణుగోపాల స్వామి

- వైభవంగా తొలి ఏకాదశి పర్వదిన వేడుకలు
- ఆలయాల్లో వేకువ జామునుంచే ప్రత్యేక పూజలు
- భక్తులకు పేలాల పిండి ప్రసాదం వితరణ
- సాధన మండలిలో చాతుర్మాస్య వ్రత దీక్షలు ప్రారంభం

రేపల్లె రూరల్: ఆషాడ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని పట్టణంలోని పలు వైష్ణవాలయాలలో తొలి ఏకాదశి పర్వదిన వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఆయా దేవాలయాలలో స్వామివార్లకు వేకువజామునే సుప్రభాత సేవలతో పాటు ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో ఉప్పూడి రోడ్డులోని శ్రీ వేంకటేశ్వర స్వామి, ఓల్డ్ టౌన్‌లోని వేణు గోపాలస్వామి, రైలుపేటలోని పట్టాభిరామ స్వామి, రామకోటిపేటలోని కోదండ రామస్వామి ఆలయాలలో భక్తులు అధిక సంఖ్యలో స్వామివార్లను దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయాల కమిటీ సభ్యులు పేలాల పిండిని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు. మండలంలోని పేటేరు, కై తేపల్లి, బేతపూడి, చోడాయపాలెం, పెనుమూడి వైష్ణవాలయాలల్లో ఏకాదశి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

గీతా జ్ఞాన మందిరంలో అర్ధ ఏకాహం

వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలోని గీతాజ్ఞాన మందిరంలో పౌర్ణమి ముందు వచ్చే ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం 5వ హరే రామ హరేకృష్ణ అర్ధ ఏకాహం నిర్వహించారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు హరేరామ హరేకృష్ణ నామ పారాయణ కొనసాగింది. గీతా గురూజీ పందిరి శ్రీశైలం ఆశీస్సులతో 12 నెలల పాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సంకల్పించారు. సాయంత్రం 6 గంటలకు సామూహిక హారతితో కార్యక్రమం ముగిసింది. దోనేపూడి, గొరిగపూడి, గుత్తావారిపాలెం, పెసర్లంక, వరికూటివారిపాలెం, గూడవల్లి తదితర గ్రామాల నుంచి భజన బృందాలు ఈ ఏకాహంలో పాల్గొన్నాయి. సమరసత సేవా ఫౌండేషన్ రేపల్లె ఖండ ప్రముఖ్ క్రాప రవికుమార్, యునెస్కో వాస్తు పండిట్ వంగర చలమయ్య సిద్ధాంతి పాల్గొన్నారు. కార్యక్రమాన్ని గీతాజ్ఞాన మందిరం నిర్వాహకులు వేములపల్లి వనజాక్షి పర్యవేక్షించారు.

భట్టిప్రోలులో..

భట్టిప్రోలులోని యాదవబజార్‌లోని రామ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరేరామ హరేకృష్ణ ఏకాహం నిర్విఘ్నంగా కొనసాగించారు. ఐలవరంకు చెందిన దీపాల సత్యన్నారాయణ బృందం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సాధన మండలిలో చాతుర్మాస్య వ్రత దీక్షలు ప్రారంభం

భట్టిప్రోలు: తొలి ఏకాదశి శ్రీ మహావిష్ణువుకు అత్యంత ప్రీతి పాత్రమైనదని ఉభయ భాషా ప్రవీణ హరి అన్నయ్య శాస్త్రి (శృంగేరీ పీఠం)పేర్కొన్నారు. భట్టిప్రోలు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో బుధవారం నుంచి చాతుర్మాస్య వ్రత దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులను ఉద్దేశించి అన్నయ్య శాస్త్రి మాట్లాడుతూ.. ఆషాఢ మాసాన వచ్చే ఈ ఏకాదశి రోజు క్షీరాబ్ధిలో శ్రీ మహావిష్ణువు శయనిస్తాడు కనుక ఈ ఏకాదశని శయన ఏకాదశి అని కూడా అంటారని తెలిపారు. నవంబర్ 12 వరకు ఈ దీక్షలు కొనసాగుతాయని సాధన మండలి అధ్యక్షురాలు బూర్లె అరుణకుమారి తెలిపారు. ఉదయం ఓంకార పతాకాన్ని దీవి నాగ శేషాచార్యులు ఆవిష్కరించి జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమాలను సాధన మండలి అధ్యక్షురాలు బూర్లె అరుణ కుమారి, ఉపాధ్యక్షులు కోట సంధ్యారాణి, ప్రధాన కార్యదర్శి కె.యశోదాదేవి, సహాయ కార్యదర్శి మానేపల్లి వెంకట హృదయ ధనలక్ష్మి, కోశాధికారి పి. దేవసేన ఆండాళ్, ఎస్ఎస్ఎఫ్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకర రావు, యునెస్కో వాస్తు పండిట్ వంగర చలమయ్య సిద్ధాంతి, నిర్వాహకులు సీతారత్నం, బండి వెంకట్రావు, చుండూరు గోపాలకృష్ణమూర్తి, వంగర నాగేశ్వరరావు, సీహెచ్ పాపారావు, తూనుగుంట్ల వెంకటేశ్వర గుప్తా, సాధన మండలి సభ్యులు పాల్గొన్నారు.



వేమవరంలో రుక్మాబాయి సహిత పాండురంగ స్వామివారు

వైభవంగా పాండురంగ స్వామి కల్యాణం

వేమవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరంలో కొలువైన రుక్మాబాయి సహిత పాండురంగ స్వామి దేవాలయంలో బుధవారం స్వామి వారి కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలి ఏకాదశి సందర్భంగా ప్రతి ఏటా స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తున్నట్లు అర్చకులు ధారా నారాయణమూర్తి తెలిపారు. స్వామి వార్లకు ప్రాతఃకాలంలో అభిషేకాలు, అనంతరం నిర్వహించిన శాంతి కల్యాణంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. దేవాలయ కమిటీ నిర్వాహకులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

కన్నుల పండువగా తొలి ఏకాదశి వేడుకలు

బాపట్లటౌన్: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని పట్టణంలోని చీలు రోడ్డులో వేంచేసి ఉన్న శ్రీ రుక్మిణీ సమేత పాండురంగ స్వామి వారి దేవాలయంలో ఆలయ అర్చకులు రొంపిచర్ల కేశవాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం స్వామివారిని గరుడ వాహనంపై పురవీధుల్లో ఊరేగింపు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం నిర్వహించారు.

■ పట్టణంలోని సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత క్షీర భావన్నారాయణస్వామి దేవాలయంలో స్వామివారికి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి సహస్ర పారాయణ కార్యక్రమం నిర్వహించారు.



రేపల్లెలో భక్తులకు దర్శనమిస్తున్న వేంకటేశ్వరుడు



గీతాజ్ఞాన మందిరంలో శ్రీ కృష్ణ పరమాత్ముడు



అర్ధ ఏకాహంలో పాల్గొన్న భజన బృందాలు



ఊరేగిన ఉత్సవ మూర్తులు

బండ్లమ్మకు ఆషాఢం సారె



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి అమ్మవారికి భవనంవారిపాలెం శివారు చోడిపాలెం గ్రామం తరుపున మహిళలు ఆషాఢం సారెను సమర్పించారు. గ్రామ సర్పంచ్ మోదుగుల శివ నాగేశ్వరితో పాటు గ్రామానికి చెందిన మహిళలు బుధవారం ఉదయం దేవాలయానికి చేరుకుని అమ్మవారి దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. చీర, రవికెలతో పాటు సారె, మట్టి గాజులు, పండ్లు, చలిమిడి, పలు రకాల పిండి వంటలను తీసుకుని వచ్చి అమ్మవారికి సమర్పించారు. ప్రతి ఏడాది ఆషాఢ మాసంలో అమ్మవారికి ఆషాడం సారెను సమర్పించడం ఆనవాయితీగా వస్తుందని వారు తెలిపారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె రూరల్: కారుమూరు, నల్లూరుపాలెం లోని 11 కేవీ ఫీడర్ లైన్‌ల మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ డీఈ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా ఫీడర్‌ల పరిధిలోని ఉప్పూడి, నల్లూరుపాలెం, సింగుపాలెం, విశ్వేశ్వరం, కారుమూరు, వేజళ్లవారిలంక గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

చుండూరు(వేమూరు): చుండూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని మోదుకూరు గ్రామంలో విద్యుత్ లైన్‌లు మరమ్మతుల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని ఏ ఈ దోనేపూడి అర్జునరావు బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఆటంకం కలగనుందని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు 2 గ్రామాల్లో విద్యుత్ నిలుపుదల

భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పెసర్లంక, పెదలంక ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పి.ఏడుకొండలు బుధవారం తెలిపారు. పెసర్లంకతో పాటు పెదలంక గ్రామాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా సరఫరాకు విఘాతం కలుగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్యూఆర్ కోడ్‌తో విద్యుత్ బిల్లుల చెల్లింపు



బాపట్ల: విద్యుత్ బిల్లులను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న క్యూఆర్ కోడ్‌తో చెల్లించవచ్చని ఆ శాఖ ఏఈ పెరుగు శ్రీనివాసరావు పేర్కొన్నారు. బాపట్ల పట్టణంలోని విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఫోన్ పే, గూగుల్ పే ద్వారా బిల్లులు చెల్లించే వినియోగదారులు నేరుగా గూగుల్‌లో విద్యుత్‌శాఖ ప్లేస్టోర్ నుంచి క్యూఆర్ కోడ్‌ను డౌన్‌లోడ్ చేసుకుని చెల్లించవచ్చని తెలిపారు. ఈ మేరకు బాపట్ల పట్టణంలోని పలు చోట్ల క్యూఆర్‌కోడ్ కరపత్రాలను సైతం అంటించటం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ బర్మాప్రసాద్, ఎన్.శ్రీనివాసరావు, లైన్‌మెన్ డీ.సుబ్బారావు, ఏ.రఘుబాబు, రమేష్‌బాబు ఉన్నారు.

ఖరీఫ్ సాగులో అన్నదాతలు నిమగ్నం



వరి విత్తనాలు జల్లుతున్న రైతులు



వెదసాగుకు ట్రాక్టర్‌తో దుక్కు దున్నుతున్న రైతు

- సమృద్ధిగా వర్షాలు కురుస్తుండటంతో జోరందుకున్న వ్యవసాయ పనులు
- వెద పద్ధతిలో సాగుపై పెరిగిన అవగాహన

నగరం: ఖరీఫ్ సీజన్‌లో వరినారు మడుల ప్రక్రియ ఊపందుకుంది. కొన్ని రోజులుగా ఏకధాటిగా వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీనిలో భాగంగానే వరి నారుమళ్లు పోసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. మండలంలో ప్రతి ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సుమారు 28 వేల ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తుంటారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితులు సాగుకు అనుకూలించడంతో రైతులు వ్యవసాయ పనులకు శ్రీకారం చుడుతున్నారు. పంట పొలాలను దుక్కి దున్ని వరి విత్తనాలను జల్లే పనిలో నిమగ్నమవుతున్నారు.

నారుమడులు సిద్ధం చేస్తున్న రైతాంగం

ఖరీఫ్ సీజన్ అసన్నమైన తరుణంలో రైతులు వరి నారు మడులను సిద్ధం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాల రాకతో పంట పొలాలు నారుమడులకు అనువుగా ఉండటంతో దుక్కులు దున్ని విత్తనాలు చల్లుతున్నారు. ఇదిలా ఉంటే మరి కొంత మంది రైతులు వెద పద్ధతిలో వరిసాగు చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.ఈ పద్ధతి అవలంబించడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ నిపుణులు సూచించడంతో రైతులు వెద సాగుపై దృష్టి సారిస్తున్నారు. వెద సాగుకు అవసరమైన అన్ని పనులను రైతులు పూర్తి చేస్తున్నారు.

ఆర్థికసాయం అందజేత

కర్లపాలెం: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటారని ఎంపీపీ యారం వనజ, వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండలాధ్యక్షుడు యల్లావుల ఏడుకొండలు తెలిపారు. ఇటీవల పేరలిపాడు గ్రామంలో వరిగడ్డి వామి దగ్ధమై నష్టపోయిన బాధితుడు కాగిత ఆనందరావుకు కోన రఘుపతి పంపిన రూ.10వేల నగదును సర్పంచ్ మల్లెల కరుణకుమారితో కలసి ఎంపీపీ యారం వనజ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఏడుకొండలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పందరబోయిన సుబ్బారావు, చింతాయపాలెం సొసైటీ చైర్మన్ మరకా పెద వెంకటేశ్వర్లు, నాయకులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, కాగిత ఆనందబాబు, యారం ఇసాక్, పందరబోయిన శ్రీనివాసరావు, చెన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

వేమూరు సీఐ బదిలీ

వేమూరు: వేమూరు సీఐ పసుపులేటి రామకృష్ణను పల్నాడు జిల్లా నరసరావుపేట రూరల్‌కు బదిలీ చేశారు. ఈయన వేమురు సీఐగా ఏడాది కాలం నుంచి పని చేస్తున్నారు. ఈయన స్థానంలో కొత్త సీఐ బాధ్యతలు చేపట్టాల్సి ఉంది.

సమాచార హక్కు చట్టంపై నేడు అవగాహన

చుండూరు(వేమూరు): సమాచార హక్కు చట్టంపై గురువారం మధ్యాహ్నం 3 గంటలకు చుండూరు ఆర్య వైశ్య కల్యాణ మండంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి వి ఆదాంబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు రైతులు, ప్రజలు పాల్గొని అవగాహన పెంచుకోవాలని సూచించారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం



భట్టిప్రోలు ఓబిద్ మహల్లాలో అలంకరించిన పీర్లు



కొల్లూరులో పీర్ల వద్ద ప్రార్థనలు

భట్టిప్రోలు: మత సామరస్యానికి ప్రతీకగా నిర్వహించే మొహర్రం పండుగను బుధవారం భట్టిప్రోలు మండలంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భట్టిప్రోలు, అద్దేపల్లి, వేమవరం, పల్లెకోన, వెల్లటూరు గ్రామాల్లో ఈ పండుగను ముస్లింలు సంప్రదాయబద్ధంగా నిర్వహించుకున్నారు. పీర్లను ఊరేగించారు. స్థానిక ఓబిద్ మహల్లా ఆధ్వర్యంలో తల్లి పీరును మేళ తాళాల మధ్య పురవీధులలో ఊరేగించారు. ఈ కార్యక్రమాన్ని ప్రెసిడెంట్ ఆదమ్ షఫీ, వైస్ ప్రెసిడెంట్ గౌస్, నిర్వాహకులు కరిముల్లా, ఖాజా, సాల్మన్, చాంద్‌ఖాన్, బషీర్‌ఖాన్‌లు పర్యవేక్షించారు. ముస్లిం మత పెద్దల సూచన ప్రకారం ప్రార్థనలు చేశారు.

మొహర్రం మాసం ఆరంభం రోజున ఇస్లాం నూతన సంవత్సరం ప్రారంభమవుతుంది. ఈ పండుగను పీర్ల పండుగ అని కూడా పిలుస్తారు.

కొల్లూరు : మొహర్రం పండుగను మండలంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం కొల్లూరు జెండా చెట్టు వద్ద ముస్లింలు మత పెద్దల సూచనల మేరకు ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం నూతన వస్త్రాలు, పూలతో అలంకరించిన పీర్లను గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. మత సామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లింలు పీర్లను దర్శించుకొని తమ భక్తి ప్రపత్తులను చాటుకున్నారు. అనంతరం పీర్లను జెండా చెట్టు వద్దనున్న పీర్ల చావిడికి తరలించి ప్రతిష్ఠించారు.

ఏకలవ్యుని జీవితం యువతకు ఆదర్శం



ఏకలవ్యుని విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

బాపట్ల: ఏకలవ్యుడు యువతకు ఆదర్శనీయుడని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ అధ్యక్షులు దేవరకొండ రాము పేర్కొన్నారు. ఏకలవ్య జయంతి సందర్భంగా స్టువర్టుపురం గ్రామంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కఠోర దీక్షకు, అంకిత భావానికి ఏకలవ్యుడు నిదర్శనంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు చుక్కా పౌలు, మోటా రామారావు, రఘు, ఉయ్యాల శివ, జె.నాగరాజు, చిన్నపోతుల హరి తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలి

అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ప్రసాద్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతు కూలీ సంఘ సభ్యులు

రేపల్లె రూరల్: వ్యవసాయ రంగంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి మేకల ప్రసాద్ అన్నారు. కర్నూలులో ఈ నెల 25న నిర్వహించే అఖిల భారత రైతు కూలీ సంఘ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశానికి చిన్న, సన్నకారు రైతులు హాజరు కావాలని కోరుతూ పట్టణంలోని 13వవార్డు గాంధీనగర్‌లో బుధవారం నిర్వహించిన వాల్‌పోస్టర్‌ల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ రంగంపై శ్రద్ధ కనపరచకపోవడంతో రైతులు ప్రతి వ్యవసాయ సీజన్‌లో తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. వ్యవసాయ కూలీలకు గ్రామీణ ప్రాంతాల్లో కేవలం ఏడాదిలో 150 రోజుల పని దినాలు మాత్రమే లభిస్తున్నాయన్నారు. దీంతో ఉపాధి కోసం కూలీలు వలసలు పోతున్నారన్నారు. రైతులు ఆరుగాలం పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. దేశ జీడీపీలో వ్యవసాయ రంగం వాటా క్రమంగా క్షీణిస్తోందన్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన వారి విద్యకు తగిన పని దొరకక యువతరం గందరగోళానికి గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఉపాధి రంగాన్ని మెరుగుపరచకుండా ముఖ్యంగా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయకుండా గ్రామీణ పేదల బ్రతుకుల్లో మార్పు అసాధ్యమని అన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం నాయకులు తలపల శివ నాగులు, ఎన్.బీబీ జాన్, సుబ్బారావు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి కూలీలతో నిరసన

వేమూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీల బకాయిలు వెంటనే విడదల చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బొనిగల ఆగస్టిన్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కూలీలతో తహసీల్దారు కార్యాలయం వద్ద గురువారం 11 గంటలకు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉపాధి కూలీలంతా హాజరై నిరసన కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి



మృతి చెందిన కోటేశ్వరరావు

వెల్లటూరు(భట్టిప్రోలు): ద్విచక్ర వాహనం అదుపు తప్పి సైడు కాల్వలో పడిపోవడంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడిన సంఘటన స్థానికంగా చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కొల్లూరు మండలం తురకపాలెంకు చెందిన వాగోలు కోటేశ్వరరావు (52) బుధవారం పొలం పనుల నిమిత్తం వెల్లటూరు వచ్చాడు. పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో దోనేపూడికి చెందిన పాములును ఎక్కించుకుని వెళుతున్నాడు. ఈ క్రమంలో వెల్లటూరు దాటిన తరువాత ద్విచక్ర వాహనం అదుపు తప్పి సైడు కాలువలోకి దూసుకెళ్లింది. అక్కడ ఉన్న చెట్టు మోడు కోటేశ్వరరావు ముఖానికి గట్టిగా గుద్దుకోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం మేరకు భట్టిప్రోలు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి కుమారుడు పాల్‌దాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.